క్లుప్తంగా

కుటుంబ నియంత్రణ పద్ధతులు పాటించేలా చూడాలి



వైద్యసిబ్బందితో మాట్లాడుతున్న డాక్టర్ ప్రవీణ్‌కుమార్

కర్నూలు(హాస్పిటల్): సమాజంలో ప్రజలు కుటుంబ నియంత్రణ పద్ధతులు పాటించేలా చూడాలని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ వై.ప్రవీణ్‌కుమార్ చెప్పారు. కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని మాతాశిశు కేంద్రంలో కుటుంబ నియంత్రణ శిక్షణ కార్యక్రమాన్ని శనివారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుటుంబ నియంత్రణ శిక్షణ ముగిసిన తర్వాత ప్రాథమిక ఆరోగ్యకేంద్రాల్లో ఆపరేషన్లు చేయాలని చెప్పారు. కార్యక్రమంలో డాక్టర్ విజయభాస్కర్, స్టాఫ్‌నర్స్ వనజ, ఎంఎస్‌వో చాంద్‌బాషా పాల్గొన్నారు.

28న జాబ్‌మేళా

కర్నూలు సిటీ: ప్రభుత్వ మైనార్టీ పాలిటెక్నిక్ కాలేజీలో ఈ నెల 28వ తేదీన ఎస్‌ఏసీ ఇంజన్ కంపొనెంట్స్ ప్రైవేటు లిమిటెడ్(చైన్నె) వారు జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు ఆ కాలేజీ ప్రిన్సిపాల్ ఎ.చక్రవర్తి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.డిప్లమాలో అన్ని బ్రాంచ్‌ల వారు మూడు సంవత్సరాలు పూర్తి చేసినా లేదా ఫెయిల్ అయినా మేళాలో పాల్గొనవచ్చన్నారు. పూర్తి వివరాలకు 88975 44821, 89196 38961 నంబర్లలో సంప్రదించాలన్నారు.

నేడు డీసీసీబీ మహాజనసభ

కర్నూలు(అగ్రికల్చర్): జిల్లా సహకార కేంద్ర బ్యాంకు మహా జనసభ ఈ నెల 26న జరుగనుంది. ఆదివారం ఉదయం 10 గంటలకు కేడీసీసీబీ ఓల్డ్ టౌన్ బ్రాంచ్‌లో చైర్ పర్సన్ మహాలక్ష్మి అధ్యక్షతన జరుగుతుంది. మహాజనసభలో పలు కీలక నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉంది. మహాజనసభకు ఉమ్మడి కర్నూలు జిల్లాలోని పీఏసీఎస్‌ల చైర్మన్‌లు హాజరవుతారని అధికారులు తెలిపారు.

మజ్జిగ పంపిణీ

కర్నూలు కల్చరల్: మెగా పవర్‌స్టార్ రామ్ చరణ్ పుట్టినరోజు సందర్భంగా ఎక్స్‌క్లూజివ్ చరణ్ ఫ్యాన్స్ (ఈసీఎఫ్) ఆధ్వర్యంలో శనివారం ఓల్డ్‌బస్టాండ్ సమీపంలో ఉచితంగా మజ్జిగ పంపిణీ చేశారు. బజరంగ్ దల్ రాష్ట్ర కన్వీనర్ టి.ప్రతాప్‌రెడ్డి అతిథిగా పాల్గొని మజ్జిగను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సేవా కార్యక్రమాల్లో మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ అభిమానులు ఎల్లప్పుడు ముందుండాలని సూచించారు. ఈసీఎఫ్ వ్యవస్థాపక అధ్యక్షులు భగీరథ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో నాయకులు ప్రకాష్, రామకృష్ణ, డానియల్, ఎల్లప్ప, అభి, హేమంత్, అరవింద్, సుజిత్, నంద, అక్షిత్ తదితరులు పాల్గొన్నారు.

రిజర్వేషన్లు కల్పిస్తే ఉద్యమిస్తాం

కర్నూలు కల్చరల్: దళిత క్రైస్తవులకు రిజర్వేషన్లు కల్పించాలని రాష్ట్ర అసెంబ్లీలో తీర్మానం చేయడాన్ని నిరసిస్తూ వీహెచ్‌పీ ఆధ్వర్యంలో శనివారం కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు గోరంట్ల రమణ మాట్లాడుతూ తీర్మాన్ని వెనక్కి తీసుకోకపోతే పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. అనంతరం జిల్లా కలెక్టర్ కోటేశ్వరరావుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో బజరంగ్ దళ్ రాష్ట్ర కో కన్వీనర్ ప్రతాప్‌రెడ్డి, విభాగ్ కన్వీనర్ నరసింహ, వీహెచ్‌పీ జిల్లా కార్యదర్శి భానుప్రకాష్, ఉపాధ్యక్షులు నాగరాజు, కార్యదర్శి ఈపూరి నాగరాజు పాల్గొన్నారు.

డిగ్రీ పరీక్షల్లో 10 మంది డిబార్

కర్నూలు(సిటీ): రాయలసీమ యూనివర్సిటీ పరిధిలోని డిగ్రీ ఒకటి, మూడు, ఐదు సెమిస్టర్ పరీక్షలలో పది మంది విద్యార్థులు డిబార్ అయ్యారు. 68 కేంద్రాల్లో జరిగిన డిగ్రీ పరీక్షలకు 14,649 మందికి గాను 13,373 మంది హాజరైనట్లు వర్సిటీ పరీక్షల విభాగం అధికారులు తెలిపారు.

బీపీఈడీ, డీపీఈడీ, ఎంపీఈడీ సెమిస్టర్ ఫలితాల విడుదల...

రాయలసీమ యూనివర్సిటీ పరిధిలోని బీపీఈడీ, డీపీఈడీ, ఎంపీఈడీ సెకండ్ సెమిస్టర్ పరీక్షల ఫలితాలను వర్సిటీ వీసీ ఆచార్య ఆకెపోగు ఆనందరావు ఆదేశాల మేరకు విడుదల చేసినట్లు పరీక్షల విభాగం డీన్ విశ్వనాథ్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. బీపీఈడీ రెగ్యులర్ పరీక్షలకు 60 మంది విద్యార్థులు హాజరుకాగా 39 మంది ఉత్తీర్ణులయ్యారు. సప్లిమెంటరీ పరీక్షలకు 29 మందికి గాను 18 మంది పాసయ్యారు. డీపీఈడీ సప్లిమెంటరీ పరీక్షలకు 9 మంది హాజరవ్వగా అందరూ ఉత్తీర్ణులయ్యారు. ఎంపీఈడీ రెగ్యులర్ 69 మందికి గాను 41 మంది ఉత్తీర్ణులయ్యారు. సప్లిమెంటరీ పరీక్షలకు 20 మంది హాజరు కాగా అందరూ ఉత్తీర్ణులైనట్లు ఆయన వెల్లడించారు.

సాక్షి సినిమాలు

ఎస్‌వీసీ కాంప్లెక్స్ : కబ్జా, బలగం, దాస్ కా ధమ్కీ, రంగమార్తాండ, జాన్ విక్ చాప్టర్-4, ఆరంజ్
వి మెగా ఆనంద్ సినీ కాంప్లెక్స్ : కబ్జా , ఫలానా అబ్బాయి ఫలానా అమ్మాయి, దాస్ కా ధమ్కీ, రంగమార్తాండ, ఖోస్టీ, గీతసాక్షిగా, ఆరంజ్
వెంకటేష్ సినీ కాంప్లెక్స్: సార్, వినరో భాగ్యము విష్ణు కథ, దాస్ కా ధమ్కీ
ఐనాక్స్ : తూ జూఠీ మై మక్కర్, షాజమ్ ఫరీ ఆఫ్ ది గాడ్స్, జాన్ విక్ చాప్టర్-4
రాజ్ : ఖోస్టీ
శ్రీరామ : ఆరంజ్
విజయ : జాన్ విక్ చాప్టర్-4

తినే మాంసం మంచిదేనా?

- మాంసం విక్రయాల్లో పాటించని నిబంధనలు
- పొట్టేళ్ల చాటున గొర్రె, మేక మాంసం అమ్మకాలు
- అనారోగ్యం, ప్రమాదాల బారిన పడిన జీవాలను వధిస్తున్న వ్యాపారులు
- 90 శాతం మంది వినియోగదారులకు అవగాహన కరువు



కర్నూలు నగరంలో కిలో మాంసం ధర రూ.860గా పేర్కొంటూ బోర్డు పెట్టిన దృశ్యం

కర్నూలు(అగ్రికల్చర్): మనం తింటున్నది నాణ్యమైన మాంసమేనా..?. ఆదివారం వచ్చిందంటే చాలు మాంసంతో విందు చేసుకోవడం పరిపాటిగా మారింది. కొంతమందికి ప్రతి రోజు ముక్క లేనిదే ముద్ద దిగని పరిస్థితి. ఎంతో ఇష్టంగా తింటున్న మాంసం మంచిదేనా.. దాని కోసం వినియోగిస్తున్న జీవాలు ఆరోగ్యంగా ఉంటున్నాయా... అనే దానిపై 90 శాతం మంది వినియోగదారులకు అవగాహన లేదు. నడిరోడ్లపై వధిస్తున్నా...ఎక్కడ పడితే అక్కడే మాంసం విక్రయిస్తున్నా కొనుగోలు చేస్తున్నారు. వ్యాపారులు మాంసానికి ఉపయోగిస్తున్నది పొట్టేళ్లా, గొర్రెలా, మేకలా అనే దానిపై ఏమాత్రం తెలియదు. ధర మాత్రం అన్నింటికీ ఒక్కటే. కర్నూలు నగరంలో కిలో మాంసం ధర రూ.750 నుంచి రూ.860 వరకు విక్రయిస్తున్నారు. అధికారుల తనిఖీలు లేకపోవడంతో వ్యాపారులు మాంసం విక్రయాల్లో ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ ప్రజారోగ్యంతో చెలగాటం ఆడుతున్నట్లు విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

నిబంధనలు ఇలా..

జనాభాలో 80 శాతం మంది మాంసం ప్రియులే కావడం విశేషం. మాంసం వినియోగం రోజురోజుకు పెరిగి పోతుండటంతో జీవాల ధరలు పైపైకి పోతున్నాయి. దీంతో సామాన్యులు కొనలేని పరిస్థితి నెలకొంది. అయితే మాంసం విక్రయాల్లో కచ్చితంగా నిబంధనలు పాటించాలి. పశువైద్యాధికారి జీవాల ఆరోగ్యాన్ని పరీక్షించి ధ్రువీకరించి ముద్ర వేసిన తర్వాతనే వధించాల్సి ఉంది. రోడ్లపై ఎక్కడబడితే అక్కడ వధించరాదు. జంతువధశాలల్లో వధించి అక్కడే క్లీనింగ్ చేసుకున్న తర్వాత బయటికి తీసుకెళ్లి అమ్మకాలు సాగించాలి. కాని నిబంధనలు ఎక్కడా అమలు కావడం లేదు. పొట్టేళ్ల చాటున గొర్రె, మేక మాంసం అమ్మకాలు చేస్తూ వినియోగదారులను మోసం చేస్తున్నారు. కొంత మంది మాంసం వ్యాపారులు అనారోగ్యానికి గురైన వాటిని, రోడ్డు ప్రమాదాలు, ఇతరత్రా కారణాలతో మరణించిన వాటిని కోసి విక్రయిస్తున్నారు. కాగా కర్నూలు నగరపాలక సంస్థకు సంబంధించి పాతబస్తీలో ఉన్న జంతువధశాలలో ఆ చుట్టుప్రక్కల ఉన్న వ్యాపారులు అక్కడ జీవాలను కట్ చేయించుకొని బయటికి తీసుకపోతుంటారు. అయితే జంతువధశాలలో పరిశుభ్రత పాటించడం లేదు. అంతేగాక ఎక్కడబడితే అక్కడ జీవాలను వధిస్తూ.. వ్యర్థాలను ప్రక్కనే ఉన్న డ్రైనేజీల్లో కలిపేస్తుండటం వల్ల వాతావరణం కాలుష్యం అవుతోంది.

అంత్రాక్స్‌తో ప్రమాదం...

ఆంత్రాక్స్ వ్యాధి ఎక్కువగా సన్న జీవాల్లోనే కనిపిస్తుంది. ఈ నెల మొదటి వారంలో నంద్యాల జిల్లాలో ఆంత్రాక్స్ కేసు నమోదు కావడం గమనార్హం. కోవెలకుంట్లలో మూడు జీవాలు ఈ వ్యాధి భారిన పడ్డాయి. మాంసం విక్రయాల్లో కనీస జాగ్రత్తలు తీసుకోకపోవడంతో వ్యాధి విస్తరణకు అవకాశం ఏర్పడుతోంది. మాంసానికి వినియోగించే జీవాలను పశువైద్యులు అన్ని విధాలా పరీక్షలు చేసి ఆరోగ్యంగా ఉన్నట్లు ధ్రువీకరించిన తర్వాతనే విక్రయించాల్సి ఉంది. ఆంత్రాక్స్ వ్యాధి ప్రమాదకరం. వ్యాధి సోకిన పశువులు, జీవాల మాంసం తినడం ద్వారా, వాటి చర్మం ద్వారా ఆంత్రాక్స్ మనుష్యులకు సులువుగా వ్యాప్తి చెందుతుంది.

అవగాహన కలిగి ఉండాలి..

మనం తీసుకునే మాంసంపై వినియోగదారులు కచ్చితంగా అవగాహన కలిగి ఉండాలి. లేత తెలుపు రంగులోని మాంసం ఆరోగ్యకరమైనది. గట్టిదనం ఉంటేనే తాజాదనం ఉన్నట్టు. విక్రయిస్తున్న మాంసం కబేళా నుంచి తెచ్చినదా.. లేదా అన్నది దుకాణదారులను ప్రశ్నించాలి. అపరిశుభ్రత ఉన్న చోట విక్రయిస్తున్న మాంసం కొనుగోలు చేయకపోవడం మంచిది. మున్సిపల్ అధికారులు అధికారికంగా వేసే ముద్రను పరిశీలించాలి. అనుమానం వస్తే మున్సిపల్, వెటర్నరీ వైద్యులకు సమాచారం ఇవ్వాలి.

నాణ్యత ప్రశ్నార్థకం



మాంసంలో నాణ్యత ప్రశ్నార్థకంగా మారింది. ధరలను మాత్రం అడ్డుగోలుగా పెంచేస్తున్నారు. ఆరోగ్యంగా ఉన్న పొట్టేలు మాంసం ఇస్తే రూ.50 ఎక్కువైన సమస్య లేదు. కాని నేడు మాంసానికి దేనిని వినియోగిస్తున్నారో తెలియడం లేదు. గొర్రె, మేకలను వినియోగిస్తున్నా, అనారోగ్యంతో ఉన్న వాటిని వధిస్తున్నా.. ఒకే ధర వసూలు చేస్తున్నారు. వినియోగదారులకు నాణ్యమైన మాంసం లభించే విధంగా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలి.

–ఆర్ ప్రసాద్, కృష్ణానగర్, కర్నూలు

నిబంధనలతోనే అందరికి ఆరోగ్యం



మాంసం విక్రయాల్లో నిబంధనలు పాటించడం చాలా అవసరం. ఇది ప్రజారోగ్యంతో ముడుపడి ఉంది. ఏదిబడితే దానిని మాంసానికి వినియోగిస్తే ప్రజల ఆరోగ్యాన్ని దెబ్బతీసినట్లే. జీవాలను ఎక్కడబడితే అక్కడ వధించరాదు. జంతువధశాలలోనే కట్ చేసుకోవడంతో పాటు క్లీన్ చేసుకొని బయటికి తీసుకెళ్లి విక్రయించుకోవాలి. జీవాల ఆరోగ్యం బాగా ఉన్నట్లు ధ్రువీకరించిన తర్వాతనే వినియోగించాలి. జిల్లాలో జీవాలకు అంత్రాక్స్ ప్రమాదం పొంచి ఉంది. ఇప్పటికే నంద్యాల జిల్లాలో ఆంత్రాక్స్ కేసు నమోదు అయింది. ఈ నేపథ్యంలో జాగ్రత్తలు తప్పనిసరి.

–డాక్టర్ రవిబాబు, సహాయ సంచాలకులు, జిల్లా పశువ్యాధి నిర్ధారణ కేంద్రం, కర్నూలు

జాబ్‌మేళాకు విశేష స్పందన



ఉద్యోగాలు పొందిన వారితో కాలేజీ ప్రిన్సిపాల్ రవికుమార్ రెడ్డి తదితరులు

కర్నూలు సిటీ: మదర్ థెరిస్సా ఫార్మాసీ కాలేజీలో శనివారం నిర్వహించిన జాబ్ మేళాకు విశేష స్పందన లభించింది. మెడి అసిస్టెంట్ ప్రైవేటు లిమిటెడ్(బెంగళూరు)నిర్వహించిన మేళాలో బీ-ఫార్మాసీ, ఎం-ఫార్మాసీ విద్యార్థులు వంద మందికి పైగా పాల్గొనగా 20 మందికి ఉద్యోగాలు వచ్చినట్లు కాలేజీ ప్రిన్సిపాల్ డా.రవికుమార్ రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డా.సురేష్, అకడమిక్ డీన్ రాజ్‌కుమార్, మెడి అసిస్టెంట్ ప్రైవేటు లిమిటెడ్ హెచ్‌ఆర్ అంజన్‌కుమార్ పాల్గొన్నారు. ఉద్యోగాలు పొందిన వారిని కాలేజీ డైరెక్టర్ డా.ఆదిమూలపు సతీష్ అభినందించారు.

నేడు సేవాస్తంభ్ రాష్ట్ర సర్వసభ్య సమావేశం

కర్నూలు(అర్బన్): ఈ నెల 26వ తేదీన మధ్యాహ్నం 2 గంటలకు స్థానిక రాజ్‌విహార్ సెంటర్‌లోని అంబేద్కర్ భవన్‌లో సేవాస్తంభ్ రాష్ట్ర సర్వసభ్య సమావేశం జరుగుతున్నట్లు రాష్ట్ర కన్వీనర్ పూల వీరయ్య తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ సమావేశానికి జాతీయ అధ్యక్షుడు కందుల నాగేశ్వరరావు, ప్రతినిధులు మీనా తదితరులు హాజరవుతున్నట్లు చెప్పారు. సమావేశంలో రాష్ట్ర కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు, సభ్యుల ఎన్నిక జరుగుతుందని, రాష్ట్రంలోని అన్ని జిల్లాల అధ్యక్ష, కార్యదర్శులు, సేవాస్తంభ్ అనుబంధ సంఘాలుగా ఉన్న ఎన్‌జీఓలు తమ సభ్యులతో హాజరు కావాలని కోరారు.

సీతాదేవి పవిత్ర చరిత్రే శ్రీమద్రామాయణం

కర్నూలు కల్చరల్: లోకోత్తరుడైన శ్రీరాముని ఆదర్శ చరిత్రను చెప్పుచున్నందున రామాయణం అని, సకల స్త్రీ లోకానికి ఆదర్శ భూతమైన సీతాదేవి పవిత్ర చరిత్రను వర్ణించినందున సీతాదేవి చరితమని, రావణుని వధను తెలుపుట వలన పౌలస్త్య వధ అని మూడు విధాలుగా శ్రీమద్రామాయణం పిలువబడుతుందని ధార్మిక ప్రవచకులు పరశురాముని రామకృష్ణ అన్నారు. తిరుమల తిరుపతి దేవస్థానములు హిందూ ధర్మప్రచార పరిషత్, రాంబొట్ల దేవస్థానం సంయుక్త నిర్వహణలో పాతబస్తీలోని రాంబొట్ల దేవస్థానంలో ప్రవచన కార్యక్రమాలు జరుగుతున్నాయి.మూడవ రోజు శనివారం శ్రీమద్రామాయణం - సీతాయాశ్చరితం అనే అంశంపై ప్రవచించారు. కార్యక్రమంలో తిరుమల తిరుపతి దేవస్థానములు హిందూ ధర్మ ప్రచార పరిషత్తు ఉమ్మడి కర్నూలు జిల్లా శాఖ కార్యనిర్వాహకులు డాక్టర్ మల్లు వెంకటరెడ్డి, తరిగొండ వెంగమాంబ సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షులు పసుపులేటి నీలిమ, అధ్యాపకురాలు హరీబెల్ సీతామహాలక్ష్మి, స్థానిక అర్చకులు క్రమధాటి గిరీశ్వర శర్మ, సిబ్బంది బి.వి.శివరాముడు, శ్రీ కాశీవిశ్వేశ్వరస్వామి దేవస్థానం భజన మండలి అధ్యక్షులు మల్లేష్, రాధాకృష్ణ, మోహనరావు, నర్సప్ప, నరేష్, దాసుతో పాటు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

యోగాతో ఒత్తిడి దూరం



యోగాసనాలు చేయిస్తున్న గురువు శివరాజ్

కర్నూలు కల్చరల్: హార్ట్ ఫుల్‌నెస్ ఇనిస్టిట్యూట్, శ్రీరామ చంద్ర మిషన్, సాంస్కృతిక మంత్రిత్వ శాఖల ఆధ్వర్యంలో హర్ దిల్ ధ్యాన్.. హర్ దిన్ ధ్యాన్ పేరుతో గణేష్ నగర్ రామచంద్ర మిషన్‌లో నిర్వహిస్తున్న యోగ మహోత్సవం రెండో రోజు శనివారం కొనసాగింది. భారత్ స్వాభిమాన్ జిల్లా కోఆర్డినేటర్ శివరాజ్, పతంజలి సమితి సభ్యులు ఉపేంద్ర గౌడ్‌లు యోగ, ధ్యానం గురించి వివరించారు. యోగాతో ఒత్తిడి దూరం అవుతుందన్నారు. యోగాసనాలు సాధన చేయించారు. అదేవిధంగా డీఎస్పీ మహబూబ్ బాషా, రామచంద్ర మిషన్ కర్నూలు, అనంతపురం జోనల్ కోఆర్డినేటర్ కె.రామాంజనేయులు, కర్నూలు కేంద్రం కోఆర్డినేటర్ బి.పి.వెంకటరెడ్డి ప్రసంగించారు. రామచంద్ర మిషన్ సభ్యులు పాల్గొన్నారు.

నొప్పిలేకుండా విద్యుత్ తరంగాల చికిత్స



ఈసీటీ మాన్యువల్‌ను విడుదల చేస్తున్న వైద్యులు

కర్నూలు(హాస్పిటల్): మానసిక సమస్యలతో బాధపడుతున్న వారికి నొప్పి లేకుండా ఎలక్ట్రోకన్వల్సివ్ థెరపి(విద్యుత్ తరంగాల చికిత్స) ఇస్తున్నట్లు బెంగళూరులోని నిమ్‌హాన్స్ సైకియాట్రి ప్రొఫెసర్ డాక్టర్ జగదీష తిథల్లి చెప్పారు. శనివారం కర్నూలు శివారులోని పెంచికలపాడులో ఉన్న విశ్వభారతి మెడికల్ కాలేజీలో డిపార్ట్‌మెంట్ ఆఫ్ సైకియాట్రి, కర్నూలు సైకియాట్రి సొసైటీ ఆధ్వర్యంలో ఈసీటీపై వర్క్‌షాప్ నిర్వహించారు. కార్యక్రమాన్ని కళాశాల చైర్మన్ డాక్టర్ డి.కాంతారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ జగదీష మాట్లాడుతూ ఈసీటీలో వచ్చిన అధునాతన, అడ్వాన్స్‌డ్ పద్ధతుల గురించి వివరించారు. ఆధునిక వైద్యంలో రోగికి అనెస్తీషియా ఇచ్చి నొప్పి లేకుండా తక్కువ సైడ్ ఎఫెక్ట్స్‌తో చికిత్సను అందిస్తున్నట్లు తెలిపారు. తీవ్ర మానసిక సమస్యలు, ఆత్మహత్యలకు సిద్ధమైన వారికి ఇలాంటి చికిత్సలు ఎంతో ఉపయోగపడతాయన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ మునీరుద్దీన్, ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ శివశంకర్‌రెడ్డి, కర్నూలు సైకియాట్రి సొసైటీ అధ్యక్షులు డాక్టర్ రమేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

సుస్థిర అభివృద్ధి సర్వేను వేగవంతం చేయాలి

- డీఎల్‌డీఓ బాలకృష్ణారెడ్డి



పెండింగ్ ఫైల్స్‌ను ఆరా తీస్తున్న డీఎల్‌డీఓ

కర్నూలు (న్యూటౌన్): సుస్థిర అభివృద్ధి లక్ష్యాలను సాధించేందుకు చేపట్టిన సర్వేను వేగవంతం చేయాలని కర్నూలు డీఎల్‌డీఓ బాలకృష్ణారెడ్డి సూచించారు. శనివారం ఎంపీడీఓ కార్యాలయాన్ని ఆయన తనిఖీ చేసి అభివృద్ధి, సంక్షేమ పథకాలకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి సంబంధించిన అభివృద్ధి పనులను పూర్తి చేసి బిల్లులను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని అధికారులను ఆదేశించారు. పెండింగ్‌లో ఉన్న ఆయుస్మాన్ భారత్ ఇన్సూరెన్స్ కార్డులు, మ్యారేజ్ సర్టిఫికెట్‌లు బాధితులకు అందజేయాలన్నారు. బియ్యం కార్డులు, 0 నుంచి 5 ఏళ్లల్లోపు పిల్లలకు ఆధార్‌కార్డు ఎన్‌రోల్‌మెంట్, అప్‌డేట్ చేయించాలన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఎంపీడీఓ ఎన్ భాస్కర్ నాయుడు, జూనియర్ అసిస్టెంట్ వినోద్ పాల్గొన్నారు.

పన్నుదారులు వడ్డీ మాఫీని వినియోగించుకోవాలి

కర్నూలు (టౌన్): నగరపాలక పరిధిలో పన్నుదారులు తమ ఆస్తి పన్ను బకాయిలపై ప్రభుత్వం వడ్డీని మాఫీ చేసినట్లు నగర పాలక అడిషనల్ కమిషనర్ రామలింగేశ్వర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం వన్‌టైమ్ సెటిల్‌మెంట్ కింద 2022-2023 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఆస్తిపన్ను బకాయిదారులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. ఈ అవకాశం కేవలం మార్చి 31 వరకు మాత్రమే ఉంటుందని తెలిపారు.

కౌంటర్లు పనిచేస్తాయి : పన్నుదారుల సౌలభ్యం కోసం ఆదివారం నగరపాలక సంస్థలో పన్ను కౌంటర్లు పనిచేస్తాయని ఆయన తెలిపారు. పన్నులు చెల్లించి నగర అభివృద్ధికి పాటుపడాలని కోరారు.

టీజీకి సంసాద్ రత్న అవార్డు

కర్నూలు కల్చరల్: మాజీ రాజ్యసభ సభ్యుడు టీజీ వెంకటేష్ ప్రతిష్టాత్మక సంసాద్ రత్న అవార్డును అందుకున్నారు. ప్రైమ్ పాయింట్ ఫౌండేషన్ సంస్థ శనివారం ఢిల్లీలో నిర్వహించిన కార్యక్రమంలో 2019 నుంచి 2022 సంవత్సరం దాకా ఎంపీగా, పార్లమెంటరీ కమిటీ చైర్మన్‌గా టీజీ అందించిన సేవలకు హిమాచల్ ప్రదేశ్ గవర్నర్ బండారు దత్తాత్రేయ చేతుల మీదుగా అవార్డును అందజేశారు.

ముగిసిన జాతీయ గ్రంథాలయ సదస్సు

కర్నూలు(సిటీ): ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ సోషల్ సైన్స్ రీసెర్చ్ (న్యూఢిల్లీ) వారి సహకారంతో సిల్వర్‌జూబ్లీ డిగ్రీ కాలేజీలో నిర్వహించిన జాతీయ గ్రంథాలయ సదస్సు శనివారంతో ముగిసింది. ముగింపు సదస్సులో ఆ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ వి.వి.ఎస్.కుమార్ పాల్గొని ప్రసంగించారు. రెండు రోజుల పాటు జరిగిన సదస్సులో వివిధ కళాశాలలకు చెందిన అధ్యాపకులు 64 పత్రాలను సమర్పించారన్నా రు. ఇలాంటి సదస్సుల నిర్వహణ వల్ల వివిధ ప్రాంతాల్లోని నూతన పుస్తకాలు, ఆవిష్కరణల గురించి తెలుసుకునే అవకాశం కలుగుతుందన్నారు. ఈ సమావేశంలో సదస్సు కన్వీనర్ డాక్టర్ ఎ.కిశోర్, కాలేజీ గ్రంథాలయ శాఖ అధ్యక్షుడు డాక్టర్ నాయకంటి మద్దయ్య పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షలకు 36,012 మంది హాజరు

కర్నూలు(సిటీ): ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం పరీక్షల్లో 12 మంది విద్యార్థులు డిబార్ అయ్యారు. శనివారం ఉమ్మడి జిల్లాలో 124 కేంద్రాల్లో జరిగిన పరీక్షలకు 37,485 మంది విద్యార్థులకు గాను 36,012 మంది హాజరయ్యారు. 1,473 మంది గైర్హాజరయ్యారు.

రూ.8.21 లక్షల ఆదాయం

గూడూరు: మార్కెట్ వేలం ద్వారా స్థానిక నగర పంచాయతీకి రూ.8.21 లక్షల ఆదాయం వచ్చింది. శనివారం మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులు అధ్యక్షతన జరిగిన వేలాల్లో కూరగాయల మార్కెట్‌ను సునీతమ్మ దక్కించుకుంది.వారపు సంత, గొర్రెల మాంసం, గొర్రెల కమేళ, పెద్ద పశువులు మాంసం, పెద్ద పశువుల కమేళ వేలాలు వాయిదా పడినట్లు కమిషనర్ తెలిపారు.

వైఎస్ జగన్ చిత్రపటానికి పాలాభిషేకం



ముఖ్యమంత్రి వైఎస్ జగన్ చిత్రపటంతో వస్తున్న వీఆర్‌పీఎస్ నేతలు

కర్నూలు(అర్బన్):వాల్మీకి/ బోయలను ఎస్‌టీలుగా గుర్తిస్తు అసెంబ్లీలో తీర్మాణం చేయడంపై హర్షం వ్యక్తం చేస్తూ వీఆర్‌పీఎస్ నేతలు సీఎం వైఎస్ జగన్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. శనివారం స్థానిక కజీజీ హాస్పిటల్ సర్కిల్‌లో ఉన్న వాల్మీకి మహర్షి విగ్రహానికి వీఆర్‌పీఎస్ రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు ఎం.సుభాష్ చంద్రబోస్, ఉపాధ్యక్షులు కప్పట్రాళ్ల మల్లికార్జున తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ముఖ్యమంత్రి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా సుభాష్ మాట్లాడుతూ..పాదయాత్రలో ఇచ్చిన హామీ మేర కు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అసెంబ్లీలో వాల్మీకి/బోయలను ఎస్‌టీలుగా గుర్తిస్తు తీర్మా ణం చేశారన్నారు. ఇచ్చిన మాటకు కట్టుబడే వ్యక్తిగా వైఎస్ జగన్ చరిత్రలో నిలిచిపోతున్నారన్నారు. త్వరలోనే పార్లమెంట్‌లో వాల్మీకుల బిల్లు చట్టబద్ధమవుతుందనే ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర అధికార ప్రతినిధి శ్రీరాములు, మాలపల్లి లక్ష్మయ్య, నాయకులు గాలన్న, చిన్నటేకూరు శ్రీరాములు, మహేష్, లోకేష్, మధు తదితరులు పాల్గొన్నారు.

వైద్య విద్యార్థుల రక్తదానం



రక్తదానం చేస్తున్న విద్యార్థిని అభినందిస్తున్న సూపరింటెండెంట్ డాక్టర్ జి.నరేంద్రనాథ్‌రెడ్డి

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు మెడికల్ కాలేజీ 2017 బ్యాచ్ అవుట్ గోయింగ్ స్టూడెంట్స్ శనివారం ఆసుపత్రిలోని రక్తనిధిలో రక్తదానం చేశారు. ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో 70 మంది హౌస్‌సర్జన్లు, వైద్య విద్యార్థులు రక్తదానం చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ జి. నరేంద్రనాథ్‌రెడ్డి వారిని అభినందించారు. రక్తదానం చేయడం వల్ల మరొకరికి అత్యవసరంలో రక్తం లభించి ప్రాణం నిలుస్తుందన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ సి.ప్రభాకర్‌రెడ్డి, హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్ డాక్టర్ శివబాల నాగాంజన్, డెర్మటాలజీ హెచ్‌వోడీ డాక్టర్ పెంచలయ్య, బ్లడ్ బ్యాంక్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శాంత తదితరులు పాల్గొన్నారు.

29న వేలం పాటలు

ఓర్వకల్లు: మండల కేంద్రంలో పంచాయతీ ఆస్తిలకు ఈ నెల 29న వేలం పాట నిర్వహించనున్నట్లు ఈఓఆర్‌డీ సుబ్బరాయుడు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. గేటు సుంకం(బండ్ల మెట్ట) వసూలు చేసుకునే హక్కు, పంచాయతీ ఆధ్వర్యంలో నిర్మించిన నాలుగు దుకాణాలను ఏడాది కాలం పాటు నిర్వహించుకునేందుకు వేలం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. బండ్ల మెట్టకు రూ.25 వేలు, దుకాణాలకు రూ.వెయ్యి చొప్పున డిపాజిట్ చెల్లించి వేలంలో పాల్గొనాలన్నారు.

ఇళ్ల నిర్మాణాలను త్వరగా పూర్తి చేసుకోవాలి



ఎర్రదొడ్డిలో ఇళ్ల నిర్మాణాలను పరిశీలిస్తున్న ఎంపీడీఓ, హౌసింగ్ డీఈఈ

కోడుమూరు రూరల్: జగనన్న కాలనీలలో లబ్ధిదారులు త్వరగా ఇళ్ల నిర్మాణాలను త్వరగా పూర్తి చేసుకోవాలని ఎంపీడీఓ చందశేఖర్ సూచించారు. శనివారం ఎర్రదొడ్డి జగనన్న కాలనీని ఎంపీడీఓ చంద్రశేఖర్.. హౌసింగ్ డీఈఈ వాసుదేవరావుతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ ఇసుక, ఐరన్, సిమెంట్‌తో పాటు బిల్లులు ఎప్పటికప్పుడు అందజేస్తున్నామని త్వరగా నిర్మాణాలు పూర్తి చేసుకోవాలని సూచించారు. తాగు నీరు, కరెంట్, సీసీ రోడ్లు తదితర సౌకర్యాలను కూడా కల్పిస్తామన్నారు. అనంతరం ఎర్రదొడ్డి, లద్దగిరి గ్రామ సచివాలయాలను తనిఖీ చేసి కార్యాలయ రికార్డులతో పాటు, సిబ్బంది హాజరు, మూమెంట్ రిజిష్టర్లను పరిశీలించారు.

☛ సి.బెళగల్: మండల హౌసింగ్ ఏఈ సుమంత్ కంబదహాల్ గ్రామంలోని జగనన్న కాలనీలలో జరుగుతున్న ఇళ్ల నిర్మాణాలను పరిశీలించి లబ్ధిదారులకు పలు సూచనలు చేశారు. ఆయన వెంట వర్క్‌ఇన్‌స్పెక్టర్ రంగన్న తెలిపారు.

☛ గూడూరు రూరల్: మండల పరిధిలోని కె.నాగలాపురంలోని జగనన్న కాలనీలో గృహ నిర్మాణాలను హౌసింగ్ ఏఈ జమ్మన్న పరిశీలించి త్వరగా నిర్మాణాలు పూర్తి చేసుకోవాలని లబ్ధిదారులకు సూచించారు.

డాక్టర్ అచ్చెన్న మృతికి సంతాపం



డాక్టర్ అచ్చెన్న(ఫైల్)

కర్నూలు(అగ్రికల్చర్): వైఎస్‌ఆర్ జిల్లా బహుళార్థ పశువైద్యశాల డిప్యూటీ డైరెక్టర్‌గా పని చేస్తూ అను మానాస్పద స్థితిలో మరణించిన డాక్టర్ అచ్చెన్న కుటుంబ సభ్యులను జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారులు పరామర్శించారు. అన్నమయ్య జిల్లాలోని ఒక చెరువులో డాక్టర్ అచ్చెన్న మృతదేహం లభించగా వైఎస్‌ఆర్ జిల్లాలో పోస్టుమార్టం నిర్వహించారు. అనంతరం మృతదేహాన్ని కర్నూలుకు తెచ్చారు. జిల్లా పశుసంవర్ధకశాఖ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ రామచంద్రయ్య, కర్నూలు డివిజన్ డీడీ డాక్టర్ దుర్గాప్రసన్నబాబు, పలువురు ఏడీలు, వెటర్నరీ అసిస్టెంటు సర్జన్‌లు అచ్చెన్న నివాసానికి వెళ్లి సంతాపం ప్రకటించారు. బనగానపల్లి మండలానికి చెందిన డాక్టర్ అచ్చెన్న గతంలో డీఆర్‌డీఏ-వెలుగులో డెయిరీ ఏపీఎంగా పనిచేశారు. అనంతరం డోన్‌లోని ఏరియా వెటర్నరీ హాస్పిటల్ ఏడీగా పనిచేస్తూ పదోన్నతిపై రెండేళ్ల క్రితం వైఎస్‌ఆర్ జిల్లా బహుళార్థ పశువైద్యశాల డిప్యూటీ డైరెక్టర్‌గా వెళ్లారు. త్వరలో నంద్యాల జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి రానున్నట్లు ప్రచారం జరిగింది. ఈ సమయంలో ఆయన అనుమానాస్పద స్థితిలో మరణించడం పట్ల పశుసంవర్ధకశాఖలో ఆందోళన వ్యక్తం అవుతోంది. డాక్టర్ అచ్చెన్న కుమారుడు డాక్టర్ క్లింటన్ చక్రవర్తి కర్నూలు సర్వజన వైద్యశాలలో సివిల్ సర్జన్‌గా పనిచేస్తున్నారు.

డాక్టర్ అచ్చెన్న మృతిపై సీబీఐ విచారణ జరిపించండి

కర్నూలు(అర్బన్): వైఎస్సార్ కడప జిల్లా పశు సంవర్ధకశాఖలో వెటర్నరీ పాలీక్లీనిక్ డిప్యూటీ డైరెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న డాక్టర్ అచ్చెన్న మృతిపై సీబీఐ విచారణ జరిపించాలని దళిత సంఘాల నేతలు కోరారు. శనివారం ఏపీ ఎస్‌సీ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు గోన నాగరాజు, ఏపీ అగ్రి డాక్టర్స్ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు అశోకరత్నం తదితరులు కర్నూలులోని ఆయన నివాసానికి వెళ్లి అచ్చెన్న పార్థీవదేహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించి కుటుంబ సభ్యులను ఓదార్చారు. అనంతరం వారు మాట్లాడుతూ డాక్టర్ అచ్చెన్న అదృశ్యం, మృతిపై పలు అనుమానాలు ఉన్నాయన్నారు. ఒక దళిత అధికారి దారుణ హత్యను ప్రమాదంగా చిత్రీకరించడం తగదన్నారు. ఈ మృతిపై పూర్తి స్థాయిలో విచారణ చేపట్టాలన్నారు. కార్యక్రమంలో మాల విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షులు కే వెంకటేష్, ఎస్‌సీ, ఎస్‌టీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు నెత్తికొప్పుల ప్రసాద్, ఎస్‌సీ, ఎస్‌టీ వెటర్నరీ ఉద్యోగుల సంఘం నాయకులు రవిబాబు ఉన్నారు.

విజేత ఒంగోలు వృషభాలు

కల్లూరు: ఉగాది ఉత్సవాల సందర్భంగా కల్లూరులో శనివారం నిర్వహించిన బండలాగుడు పోటీల్లో ఒంగోలు వృషభాలు విజేతగా నిలిచాయి. పోటీలను పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి తనయుడు కాటసాని శివనరసింహరెడ్డి ప్రారంభించారు. పోటీలో ఒంగోలు శేషాద్రినాయుడు వృషభాలు మొదటి స్థానం, కర్నూలు పంచలింగాల భైరపోగు బ్రదర్స్ వృషభాలు రెండవ స్థానం కైవసం చేసుకున్నాయి. ఆ తర్వాత స్థానాల్లో వరుసగా డి.రంగాపురానికి చెందిన జూటూరు చిన్నారెడ్డి, ప్యాపిలికి చెందిన దీక్షిత్ ఈశ్వర్, రేమటకు చెందిన నడిపి గిడ్డయ్య, దాసప్ప నాయుడు, వెంకటేశ్వర్లు వృషభాలు నిలిచాయి. విజేతల యజమానులకు బహుమతి దాతలు వరుసగా రూ.30 వేలు, రూ.20 వేలు, రూ.15 వేలు, రూ.10 వేలు, రూ.9 వేలు, రూ. 8వేలు, రూ.వేలు అందజేశారు.

మూల పెద్దమ్మకు రూ.1.7లక్షల ఆదాయం

గడివేముల: మండల కేంద్రంలో వెలసిన మూల పెద్దమ్మకు రూ.1.7 లక్షల ఆదాయం సమకూరింది. ఇటీవల జరిగిన అమ్మవారి జాతర సందర్భంగా హుండీల్లో భక్తులు వేసిన కానుకలను శనివారం ఆలయ చైర్మన్ చిన్నన్న, ఈఓ మోహన్, పర్యవేక్షణాధికారి కిరణ్ ఆధ్వర్యంలో లెక్కించారు. మొత్తం రూ.1,73,896 నగదు సమకూరినట్లు ఆలయ చైర్మన్ చిన్నన్న తెలిపారు. గత ఏడాది కంటే ఈ ఏడాది రూ.29,038 ఎక్కువ వచ్చిందన్నారు.